క్లుప్తంగా

జనార్దనస్వామి ఆలయానికి ఏసీ సమర్పణ



ఆలమూరులో జనార్దనస్వామి ఆలయానికి సమర్పించిన ఏసీ

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దన స్వామి ఆలయానికి ఏసీ సమర్పణ జరిగింది. పెనికేరుకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు అంగర శ్రీనివాసాచార్యులు భక్తుల సౌకర్యార్థం రూ.65 వేలు విలువైన ఏసీని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఆలయ ఈవో బి.నరేంద్రకుమార్‌కు మంగళవారం అందజేశారు. ఆలయానికి ఏసీ సమర్పించిన శ్రీనివాసాచార్యులును పలువురు అభినందించారు. ఆలయ అర్చకులు అంగర భగవాన్ ఆచార్యులు ఆలయ కమిటీ సభ్యులు బొబ్బా రాంబాబు, అయినవిల్లి శ్రీనివాస్, ఏలూరు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు ప్రస్తావించని కూటమి ఎమ్మెల్యేలు



రాజోలులో మాట్లాడుతున్న ప్రచార విభాగం అధికార ప్రతినిధి కిషోర్

రాజోలు: శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా కూటమి ఎమ్మెల్యేలు చంద్రబాబు నామస్మరణ, లోకేష్ జపం, పవన్ భజన చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగ అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ ఆరోపించారు. మంగళవారం ఆయన రాజోలులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ఎమ్మెల్యేలు సభ దృష్టికి ప్రజా సమస్యలు తీసుకురాలేదని, మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేస్తుంటే నోరు మెదపలేదన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఎరువులు, యూరియా కొరత పట్టిపీడిస్తున్నా.. నాణ్యత లేని విత్తనాలతో రైతులు నష్టపోయినా ఏ ఒక్క శాసనసభ్యుడు సభలో మాట్లాడరన్నారు.

విచ్చలవిడిగా కల్తీ మద్యం విక్రయాలు



తాడి సహదేవ్

మామిడికుదురు: విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్మకాలతో కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలు తీస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి తాడి సహదేవ్ ఆరోపించారు. ఆయన మామిడికుదురులో మంగళవారం మాట్లాడుతూ తప్పుడు కేసులు పెట్టి ప్రతిపక్ష నేతలను ఇబ్బంది పెట్టడం తప్ప పాలనపై కూటమి నేతలు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. అధికార పార్టీ నేతలే కల్తీ మద్యం రాకెట్ నడిపిస్తున్నారని విమర్శించారు. ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతోందన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి ప్రజల్ని దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సహదేవ్ డిమాండ్ చేశారు.

ముగిసిన మాల్‌ఖంబ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మలికిపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–14, 17 బాల బాలికల మాల్‌ఖంబ్ సెలెక్షన్స్ ట్రయల్స్ మంగళవారం గుడిమెళ్లంక ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వివిధ పాఠశాలల నుంచి సుమారు 50 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ అబ్జర్వర్‌గా పాయసం శ్రీనివాస్, సీహెచ్ చంద్రశేఖర్, కె.శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమలాపురం జోన్ సీనియర్ వ్యాయామోపాధ్యాయులు వి.మునలయ్య, ఎస్‌జీఎఫ్‌ఐ సెక్రటరీ ఒ.ఈశ్వరరావు, ప్రసాద్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ ,గ్రామ పెద్దలు పెన్మత్స రంగరాజు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు గుంటూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు కె.రామకృష్ణ, పీడీ బి.రాధాకృష్ణ తెలిపారు.

పాఠశాలలకు క్రీడా స్థలాల కరవు

- ఉన్న స్థలాల అభివృద్ధి శూన్యం
- వేధిస్తున్న క్రీడా వస్తువుల కొరత
- కుంటుపడ్డ పాఠశాలల క్రీడలు

మలికిపురం: గ్రామీణ స్థాయిలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి కానరావడం లేదు. ప్రాథమిక పాఠశాలల నుంచి విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వం ప్రకటనలకే తప్ప ఆచరణలో చూపించడం లేదు. రాజోలు నియోజకవర్గంలో మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు మండలాల్లో మొత్తం 32 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో కేవలం 12 పాఠశాలలకు మాత్రమే క్రీడా స్థలాలు ఉన్నాయి. క్రీడా స్థలాలు ఉన్నప్పటికీ అవి మిక్కిలి లోతట్టు ప్రాంతంగా ఉండడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. మలికిపురం మండలంలో కేశనపల్లి, పల్లిపాలెం, చింతలమోరి, పడమటిపాలెం, రాజోలు బాలుర, పొన్నమండ, సఖినేటిపల్లి మండలంలో మోరి, కేశవదాసుపాలెం పాఠశాలలకు క్రీడా స్థలాలు ఉన్నప్పటికీ వర్షాకాలం వచ్చిందంటే జలమయమే. కనీసం వాటికి మెరక పనులు కూడా చేయడం లేదు. తాటిపాక పాఠశాల గ్రౌండ్‌ను కూడా ఇదే వేధిస్తోంది. కాట్రేనిపాడు, కడలి, అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం, అంతర్వేదిపాలెం, అంతర్వేది దేవస్థానం, విశ్వేశ్వరాయపురం, ఇరుసుమండ, గుడిమెళ్లంక, రామరాజులంక, గొల్లపాలెం ఉన్నత పాఠశాలలకు అసలు క్రీడా స్థలమే లేదు. ఇరుకుగా ఉండే పాఠశాలల సందుల్లోనూ, వరండాల్లోనూ విద్యార్థులు కాలక్షేపం చేస్తుంటారు. అలాగే కనీసం క్రీడా స్థలాలు లేని పాఠశాల్లో పూర్తి స్థాయిలో పీఈటీలు ఉన్నప్పటికీ స్థలాలు లేక పోవడంతో నిరుపయోగంగా ఉంది. విద్యార్థులకు పూర్తి స్థాయిలో క్రీడలపై శిక్షణ ఇవ్వలేని దుస్థితి ఆ క్రీడా ఉపాధ్యాయులది. ఇక ఆయా మండలాల్లోని పలు ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల విషయానికి వస్తే వీటిలో అనేక పాఠశాలలకు అసలు వాటి వద్దకు చేరేందుకే మార్గం లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు సతమతమవుతున్నారు. ఇక క్రీడా స్థలాలు వాటికి ఎక్కడ నుంచి వస్తాయి. దాతలు ఇచ్చిన స్థలాల్లో ఏదోలా పాఠశాల భవనాలు నిర్మించిన ప్రభుత్వం అనంతరం వాటి ఆదరణను మరచింది. క్రీడా స్థలాలు లేని పాఠశాలలకు స్థలాల సేకరణకు కూడా ప్రభుత్వం కనీస చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. పాఠశాల్లో క్రీడా పరికరాల విషయానికి వస్తే పాఠశాలలకు వచ్చే నిర్వహణ నిధుల నుం,ఇ ఏడాదికి రూ.2 వేలు చొప్పున మాత్రమే నిధులు కేటాయించుకునే అవకాశం మాత్రమే పాఠశాలకు ఉంది. ప్రత్యేకించి గ్రాంటు కేటాయింపులు లేవు. దీంతో పాఠశాలలకు కనీసం ఆధునిక క్రీడా వస్తువులు సమకూర్చుకునే వీలు లేకుండా ఉంది. ఈ విధంగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు తీవ్ర దుస్థితిని ఎదుర్కొంటున్నారు. క్రీడాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల దుస్థితి ఇలా ఉంటే దేశానికి కీర్తి తెచ్చే స్థాయికి మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏనాటికి చేరతారో ఆ దేవుడికే ఎరుక.



ఇరుసుమండలో వర్షం వస్తే ఉన్నత పాఠశాల క్రీడాస్థలం దుస్థితి

అక్కరకు రాని ఉపాధి హామీ

గ్రామాలన్నీ పాఠశాలల ఆట స్థలాలను ఉపాధి హామీ పథకంలో చేర్చి మెరక పనులు చేయాలని గత ఏడాది కాలంగా ప్రస్తుత ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆయా విభాగాలకు సూచించారు. అయితే నేటి ఆ శాఖ తీసుకున్న చర్యలు లేవు. దీంతో ఆయా ఆట స్థలాలు నిరుపయోగంగా ఉన్నాయి.

క్రీడా స్థలాలు మెరక చేయాలి



క్రీడా స్థలాలు కొద్దిపాటి వర్షానికే చెరువులుగా మారుతున్నాయి. అందుకే మెరక చేయాలని కోరుతున్నాం. నిధులు లేవంటున్నారు. ఇలా అయితే గ్రామీణ ప్రాంత పేదల క్రీడాకారులకు శిక్షణ ఎలా ఇస్తారు.

– రుద్రరాజు చిన్నరాజా, మాజీ వైస్ ఎంపీపీ, గుడిమూల

ఉపాధిలో చేరుస్తాం



ఉపాధి హామీ పథకంలో క్రీడా స్థలాలను చేర్చి మెరక చేయాలని సూచించాం. దీనిపై అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాటు చేస్తాం. పాఠశాలల క్రీడా స్థలాలు అధ్వానంగా ఉన్న మాట వాస్తవమే.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

మాజీ సీఎం జగన్‌ను కలసిన 'పాముల'



జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజేశ్వరీదేవి

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యురాలిగా నియమితురాలైన మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి మంగళవారం పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలసి పుష్పగుచ్ఛం అందించారు. సీఈసీ సభ్యురాలిగా తనను నియమించినందుకు రాజేశ్వరీదేవి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె తనయుడు, పార్టీ యూత్ విభాగం స్టేట్ జనరల్ సెక్రటరీ పాముల దేవీప్రకాష్ కూడా జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు.

18న స్వామి శాంతి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈ నెల 18న ఆర్జిత సేవగా స్వామివారి శాంతికల్యాణం నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణం టికెట్లను ముందస్తు బుకింగ్‌ను అంతర్వేది టెంపుల్ వెబ్‌సైట్ ద్వారాను, లేదా ఆలయం వద్ద కౌంటర్‌లో పొందవచ్చని పేర్కొన్నారు.

ఉన్నత విద్యలో ఉత్తమ అధ్యాపకుడిగా 'యర్రంశెట్టి'



విజయ సత్యప్రసాద్

మలికిపురం: ఉన్నత విద్యా విభాగంలో జాతీయ ఉత్తమ అధ్యాపకుడిగా మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్ అధ్యాపకుడు డాక్టర్ యర్రంశెట్టి విజయ్ సత్యప్రసాద్ ఎంపికయ్యారు. అంతర్జాతీయ సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ కార్యదర్శి టి.క్రాంతికుమార్ నుంచి ఈ మేరకు తనకు ఎంపిక పత్రం అందినట్లు మంగళవారం చెప్పారు. ఈ నెల 12న విజయవాడలో జరిగే కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ అధ్యాపకుడు పేరుతో అవార్డును అందుకోవాలని ఆయనకి ఆహ్వానం అందిందన్నారు. అలాగే నూతన బోధనా పద్ధతులతో ప్రసిద్ధి చెంది క్లిష్టమైన భావనలను సులభతరం చేస్తూ, ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ వంటి సబ్జెక్టులంటే భయపడే విద్యార్థులకు కూడా వాటిని చేరువ చేయడంలో ఆయనది అందెవేసిన చేయి అని సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే ఆయన చేస్తున్న కృషికి ఎన్నో అవార్డులు అందుకున్నారు. అంతేకాకుండా ఆయన బెంగళూరులోని ఇంటర్నేషనల్ స్కాలర్స్‌లో లైఫ్‌టైం మెంబర్‌గా కొనసాగుతున్నారు. డాక్టర్ యర్రంశెట్టికి చెందిన ఈ అంశాలను గూగుల్ స్కాలర్ నుంచి సేకరించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల కళాశాల కరెస్పాండెంట్ ఎమ్.వి.సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ ఎన్. ఆనందమహని, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చిట్టాల సత్యనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.సూర్యనారాయణరాజు, పీడీ పీడీకే ప్రసాద్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

15 నెలలుగా కల్తీ మద్యం వ్యాపారం



మలికిపురం సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన గత 15 నెలల నుంచి యథేచ్ఛగా ఆయన అనుచరులు కల్తీ మద్యం వ్యాపారం చేస్తున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్తీ మద్యంతో రూ.కోట్లు ఆర్జించారని పేర్కొన్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోయారని కూడా సూర్యారావు అన్నారు. కల్తీ మద్యంపై ప్రజలు నాణ్యత పరీక్షలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.6 వేల కోట్లు ఖర్చు చేసి 17 కొత్త మెడికల్ కాలేజీలను మాజీ సీఎం జగన్ అభివృద్ధికి చేశారని సూర్యారావు అన్నారు. మరో 5 వేల కోట్లు వెచ్చిస్తే అవి పూర్తవుతాయని కానీ, చంద్రబాబు నాయకులు ఆ దిశగా కృషి చేయడం లేదన్నారు. సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు 35 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో జగన్ సృష్టించిన ఈ కాలేజీల సంపదను చంద్రబాబు తన అనుచరులకు దోచి పెడుతున్నారని అన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి పార్టీ ఆధ్వర్యంలో గ్రామాల్లో రచ్చబండ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా గ్రామాల్లో ప్రజల సమస్యలు, ప్రభుత్వ వైఫల్లాలు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాటి శివ కుమార్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య కుమార్, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు తాడి సహదేవ్, గుర్రం జాషువా, కూనపరెడ్డి రాంబాబు, నేతల నాని, మోకా సురేష్, జిల్లెళ్ల ఉదయ్‌కిరణ్, గుబ్బల మనోహర్, అడబాల జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల ఎగుమతులతో అదనపు ఆదాయం



కొత్తపేట రైతు సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరామారావు

కొత్తపేట: నాణ్యమైన వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా మరింత ఆర్థికాభివృద్ధి సాధించేలా చైతన్యవంతులు కావాలని వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు రైతులకు సూచించారు. విదేశాలకు నాణ్యమైన వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులు ముఖ్యంగా తాజా పండ్లు, కూరగాయల ఎగుమతులకు సంబంధించి జిల్లాలోని ఆయా పంటలు సాగు చేసే ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్, రైతులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అవగాహన సదస్సు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ), ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తపేట ఏరియా ఉద్యాన అధికారి పి.కోటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన సదస్సుకు ఏడీఏ వెంకటరామారావు అధ్యక్షత వహించగా ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏడీఏ మాట్లాడుతూ ఏపీఈడీఏ అనేది భారతదేశ ఆహార ఉత్పత్తులను సరైన ప్రమాణాలతో, చట్టబద్ధతతో విదేశాలకు ఎగుమతి చేసే సంస్థ అని తెలిపారు. భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేసిందన్నారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి మన ఉత్పత్తులను ఎగుమతి చేయడం ద్వారా అదనపు ఆదాయం ఆర్జించవచ్చన్నారు. ఎంపీడీఓ నరేష్‌కుమార్ మాట్లాడుతూ మన దేశంలో పండించే వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులు మన దేశానికి వినియోగించుకోగా ఇంకా నిల్వలు ఉన్నాయన్నారు. వాటిని విదేశాలకు ఎగుమతి చేసుకోవడానికి అపెడాను సేవలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సదస్సులో అభ్యుదయ రైతులు యు.ప్రసాదరాజు, దండు సత్యనారాయణరాజు, బండారు పుల్లయ్యనాయుడు, నెక్కంటి వెంకన్న, జైకిసాన్ బసవ రైతు సంఘం చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముత్యాలరావు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలి



రాజోలులో ఆందోళన చేపట్టిన న్యాయవాదులు

రాజోలు: సుప్రీంకోర్టు సీజేఐ గవాయ్‌పై దాడి అప్రజాస్వామికమని రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు అన్నారు. మంగళవారం రాజోలు బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశంలో గవాయ్‌పై దాడిని ఖండిస్తూ, దాడికి యత్నించిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానం చేశారు. రాజోలు కోర్టు కాంప్లెక్ వద్ద దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాజోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రంశెట్టి అయ్యప్పనాయుడు, ప్రధాన కార్యదర్శి చింతా ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పొన్నాడ సూర్యారావు, జాలెం భాస్కరరావు, గొల్లమండల స్టాలిన్, మామిడిశెట్టి సాయిబాబు, దేవ రాజేంద్రప్రసాద్, మెడబల రాజ్‌మార్, గంటి రవికుమార్, సీతిపూడి సత్యనారాయణ, యేపుగంటి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ



అంబాజీపేటలో పోలీస్‌స్టేషన్ తనిఖీ చేస్తున్న రాహుల్‌మీనా

అంబాజీపేట: జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. అంబాజీపేటలో బుధవారం జరగనున్న బేతాళ ఉత్సవం సందర్భంగా తీసుకొనే చర్యలపై సమీక్షించారు. అనంతరం సాధారణ తనిఖీ కూడా నిర్వహించారు. ఎస్పీ వెంట కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు, స్థానిక ఎస్సై కె.చిరంజీవి ఉన్నారు.

కొత్తపేట కోర్టు ఏపీపీగా 'ఆచంట'



రాజోలు: కొత్తపేట కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా సీనియర్ న్యాయవాది ఆచంట శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర హోంశాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇటీవల ఆయన రాజోలు కోర్టు ఏపీపీగా బాధ్యతలు చేపట్టారు. రాజోలు కోర్టు ఏపీపీగా పని చేస్తూ కొత్తపేట కోర్టు ఏపీపీగా కూడా ఆయన కొనసాగనున్నారు. 2015–20 కాలంలో రాజోలు ఏపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. రెండో పర్యాయం ఏపీపీగా నియమితులైన శ్రీనివాస్‌ను కొత్తపేట, రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పలువురు అభినందనలు తెలిపారు. సీనియర్ న్యాయవాదులు వాడ్రేవు పాపయ్యపంతులు, వెంపరాల కామేశ్వరరావు, పీవీ కృష్ణంరాజు, పొన్నాడ సూర్యారావు, ఆకుల భాస్కరరావు, కోట సుధాకర్, మామిడిశెట్టి శ్రీనివాసరావులు అభినందించారు.

గుండెపోటుతో పీఎంపీ అలీబాబు మృతి



పి.గన్నవరం: గ్రామానికి చెందిన ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ మొల్లా అలీ బాబు (52) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం రాత్రి ఆయన నగరం గ్రామంలోని అత్తవారింటికి వెళ్లారు. అక్కడ తెల్లవారుజామున 3 గంటలకు గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అలీబాబు మృతి పట్ల గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు.

ఆకట్టుకున్న త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



మడికిలో మతగ్రంథాలను ప్రదర్శిస్తున్న త్రైత సిద్ధాంత ప్రచారకులు

ఆలమూరు: మండలంలోని మడికి, చిలకలపాడు గ్రామాల్లో మంగళవారం జరిగిన త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞాన ప్రచార కార్యక్రమం హిందుత్వ వాదులను విశేషంగా ఆకట్టుకుంది. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం శాఖ అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో భక్తబృంద సభ్యులు గ్రామంలో పర్యటించి పవిత్ర దసరా విశిష్టతను తెలియజేశారు. ఆత్మ, పరమాత్మ, జీవాత్మ అనే మూడు ఆత్మల వివరాలే భగవద్గీతలో ముఖ్యమైన జ్ఞానంగా ఆయన అభివర్ణించారు. హిందుత్వంలోని సంప్రదాయాలను, వేమన భగవాన్ పద్యాల్లోని జ్ఞానాన్ని తెలియజేశారు. అనంతరం హిందూ మత గ్రంథాలను ప్రదర్శించి హిందూమతంలో ఉన్న గొప్పతనాన్ని, ప్రజలందరికీ వివరించాలని భక్తులకు సూచించారు. త్రైత సిద్ధాంత ప్రతినిధులు పీఎస్ఎన్ మూర్తి, విజయ్, లక్ష్మీనారాయణ, సూర్యకుమారి, భరత్, లోహిత్ సంధ్యారాణి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు బేతాళ వాహనాల మహోత్సవం

- 13 వాహనాలతో భక్తులకు కనువిందు
- 58 ఏళ్లుగా కొనసాగుతున్న ఉత్సవం



శ్రీనివాసనగర్‌లో వేంచేసిన విజయ బేతాళ స్వామి

అంబాజీపేట: విజయదశమి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా జరిపే విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. రంగూన్, మయన్మార్ (బర్మా)ల్లో బేతాళ ఉత్సవాలు జరుగుతాయి. పూర్వం కొంత మంది కూలి పనులకు అంబాజీపేట, పేరూరులకు చెందిన ప్రజలు రంగూన్ తదితర ప్రాంతాలకు వెళ్లినప్పుడు బేతాళ ఉత్సవాలను నిర్వహించడం గమనించారు. బేతాళ ఉత్సవం నిర్వహించడం, పూజించడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తున్నట్లు గమనించారు. విదేశాలకు వలస వెళ్లిన వారు తిరిగి స్వదేశానికి వచ్చిన తరువాత వారు కూడా స్థానికంగా బేతాళ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 1967లో శెట్టిబలిజ అభ్యుదయ సంఘ ఆధ్వర్యంలో ప్రారంభించిన బేతాళ ఉత్సవాలు నాలుగు దశాబ్దాలుగా నిర్విఘ్నంగా కొనసాగుతూ వస్తోంది. ఈ బేతాళ ఉత్సవాలను 1981లో అంబాజీపేట పెద్దవీధి శివారు శ్రీనివాస్‌నగర్ విజయ బేతాళ స్వామి ఆలయాన్ని నిర్మించి దొమ్మేటి శ్రీరాములు, పితాని నాగిశెట్టి, శీలం వెంకట్రావు, పాటి అబ్బీసల ఆధ్వర్యంలో విస్తరించారు. ఈ ఉత్సవానికి 13 ప్రాంతాల నుంచి తరలివచ్చే వాహనాలు అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో కొలువు తీరడం, పెద్ద ఎత్తున బాణసంచా కాల్చడం, చెడీ తాలింఖానాలు ఈ ఉత్సవానికి ప్రత్యేకత. 13 ప్రాంతాల నుంచి విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనాలపై తమకు ప్రీతికరమైన దైవ రూపాలను అలంకరించి మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగించుకుంటూ అంబాజీపేట సెంటర్‌కు చేరుకుంటారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆయా పాలాల్లో వాహనాలను ఉత్సవానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కొలువుదీరే వాహనాలివే..

శ్రీనివాస్‌నగర్ నుంచి గరుత్మంతుడు, పెచ్చెట్టివారి పాలెం నుంచి గరుత్మతుండు, మాచవరం శ్రీరామ్ నగర్ నుంచి సింహం వాహనం, దొమ్మేటివారి పాలెం శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి దొమ్మేటివారి పాలెం ఆంజనేయస్వామి, పోతాయిలంక ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు విజయ గణపతి, మాచవరం ఐటికాలమ్మ గుడి నుంచి హంస వాహనం, కొత్తపాలెం నుంచి హంస వాహనం, చప్పిడివారిపాలెం నుంచి షిరిడిసాయిబాబా, గుత్తులవారిపాలెం నుంచి సింహం, నందంపూడి నుంచి రాజరాజేశ్వరిదేవి, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు వాహనాలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటాయి.

భారీ బందోబస్తు

బేతాళ ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, తీర్థం సక్రమంగా జరిగేందుకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో అంబాజీపేట ఎస్సై కె.చిరంజీవి భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆరుగురు సీఐలు, 23 మంది ఎస్సైలు, 60 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, 150 మంది కానిస్టేబుల్స్ 23 మంది ఏఎస్‌ఎస్, సాయుధ బలగాలు, 23 మంది హోం గార్డులు, 35 మంది మొబైల్ పార్టీల తో భారీ బందోబస్తు నిర్వహిస్తారన్నారు. అమలాపురం నుంచి వచ్చే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు గంగలకుర్రు మలుపు నుంచి పుల్లేటికుర్రుకు, పి.గన్నవరం నుంచి వచ్చే వాహనాలు మాచవరం నుంచి అవిడి రేవునకు మళ్లించామని, తిరిగి అదే మార్గంలో వాహనాలు తిరిగి వస్తాయని సీఐ తెలిపారు. భారీ వాహనాలు అమలాపురం నుంచి ఈదరపల్లి మీదుగా ముక్కామల వెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు. 13 వాహనాల మహోత్సవం సందర్భంగా సెంటర్ అంతా రద్దీగా ఉండే నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని ఇందుకు వాహనదారులు సహకరించాలని సీఐ కోరారు.

వైభవంగా దుర్గమ్మ ప్రతిష్ఠా మహోత్సవం



పెదపట్నంలంక ఘటాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: పెదపట్నంలంక కనకదుర్గమ్మ ప్రతిష్ఠా మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారికి ఘటాభిషేకం నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. వేదమూర్తులు ధవళ దత్తాత్రేయశర్మ, పైడిమర్రి మనోహరశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి ఆలయం వద్ద పలు పూజలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా వైనతేయ గోదావరి నదికి వెళ్లి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వైనతేయ గోదావరి నదిలో చక్రస్నానం చేయించారు. అనంతరం గోదావరి నది నుంచి ముత్తైదువలు అమ్మవారి ఆలయానికి ఘటాలతో నదీ జలాలు తీసుకువచ్చారు. ఈ నదీ జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. దీంతో పాటు పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించారు. తదుపరి కనకదుర్గమ్మకు లక్ష కుంకుమార్చన, లలితా హోమం నిర్వహించారు.

మంగతాయారుకు మొదటి బహుమతి



డీఈఓ బాషా నుంచి అవార్డు అందుకుంటున్న విద్యార్థిని మంగతాయారు

మామిడికుదురు: జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని చింతలపూడి అలివేలు మంగతాయారు మొదటి బహుమతిని సాధించింది. జీఎస్టీపై నిర్వహించిన ఈ పోటీల్లో జూనియర్స్ విభాగంలో మంగతాయారు ప్రతిభ చాటింది. అమలాపురం మునిసిపల్ హైస్కూల్లో ఈ పోటీలు మంగళవారం జరిగాయి. మంగతాయారుకు డీఈవో షేక్ సలీం బాషా మొదటి బహుమతిని అందించారు. షీల్డును, ప్రశంసాపత్రాన్ని మంగతాయారుకు అందజేశారు. గైడ్ టీచర్ ఎం.గంగాభవానిని ప్రత్యేకంగా అభినందించారు.